

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్ - 8లో..

దేశ వ్యాప్తంగా మోదీ గాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ - 8లో..



అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో ధన ప్రవాహం
- అభ్యర్థులకు మద్దతు పలికిన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ
- 12 డివిజన్లు 6,177 మంది ఓటర్లు
- ఎన్నికల బరిలో 61 మంది అభ్యర్థులు
- నేడు పోలింగ్, కౌంటింగ్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో చుక్క, ముక్కాతోపాటు ధన ప్రవాహం కనిపించింది. ఎన్నికల్లో ఖర్చులపై ఆంక్షలు లేకపోవడం, డబ్బు నియంత్రణ, కోడ్ నిబంధనలు వంటివి వర్తించకపోవడంతో బరిలో నిలిచిన అభ్యర్థులు గెలుపే ధ్యేయంగా ఖర్చుకు వెనకాడడం లేదు. వారం రోజులుగా నిత్యం దావత్‌లతోపాటు అభ్యర్థులకు నేరుగా మద్యం పంపిణీ, ఓటుకు రూ.3 వేల నుంచి 4 వేల వరకు అందించినట్లు తెలుస్తోంది. గురువారం పోలింగ్, కౌంటింగ్ నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థులు స్వయంగా ఓటర్లను కలిసి నజరానాలు అందిస్తున్నారు. ఎవరికి వారు గెలుపు ధీమాతో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కూడా మద్దతు ప్రకటించాయి. ప్యానల్‌గా ఏర్పాట్లు చేసి ప్రచారం చేశారు. అర్బన్ బ్యాంక్ పరిధిని 12 డివిజన్లుగా విభజించారు. బుధవారం సహకార శాఖ అధికారులు అర్బన్ బ్యాంక్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. సిరిసిల్లలోని పోలీస్ స్టేషన్ ముందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు పోలింగ్, వెంటనే కౌంటింగ్ పూర్తి చేయనున్నారు. ఇందుకోసం 12 డివిజన్లకు సంబంధించిన పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. 12 మంది పోలింగ్ అధికారులు, 15 మంది ఏపీవోలు, 18 మంది ఓట్ల లెక్కింపు సిబ్బందిని ఏర్పాటు చేశారు.

12 డివిజన్లు 61 మంది పోటీ

సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో 12 డివిజన్లలో ఎస్సీ ఎస్టీలకు 5వ డివిజన్ రిజర్వ్ చేయగా, 7, 10 డివిజన్లు మహిళలకు రిజర్వ్ చేశారు. 1, 2, 3, 4, 6, 8, 9, 11, 12 వార్డులు జనరల్ వార్డులుగా ఉన్నాయి. వీటి పరిధిలో 61 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. గురువారం వారి భవితవ్యంపై బ్యాంక్ సభ్యులు తేల్చనున్నారు. బ్యాంక్‌లో 6177 మంది ఓటర్లు ఉండగా పురుషులు 4800 మంది, మహిళలు 1376 మంది ఉన్నారు. ఎన్నికల బరిలో నువ్వా?నేనా? అన్నట్లుగా అభ్యర్థుల్లో పోటీ నెలకొంది. 1వ డివిజన్‌లో అరుకాల ఆనందం, గజ్జెల్లి సత్యనారాయణ, గుడ్ల వెంకటేశం, నల్ల ప్రదీప్‌కుమార్, పత్తిపాక పద్మ, బూర్ల వెంకటేశం, బొల్లి రవీందర్, వేముల మురళి, రాపెల్లి లక్ష్మీనారాయణ, 2వ డివిజన్‌లో గుడ్ల సత్యానందం, భోగ శంకర్, స్వర్గం శేఖర్, 3వ డివిజన్‌లో చొప్పదండి ప్రమోద్, బొద్దుల భాస్కర్, 4వ డివిజన్‌లో అడ్డగట్ల మురళి, వేముల హన్మాంతు, సూరం వినయ్, 5వ డివిజన్‌లో తుంగ శివరాజ్, పాటి కుమార్‌రాజు, భానోతు నీల, మొగిలి రాజు, 6వ డివిజన్‌లో ఆడెపు చక్రపాణి, కందికట్ల సదానందం, బుర్ర రాజు, మర్రిపల్లి శశికాంత్, మ్యాన రాంప్రసాద్, వంగరి అంబదాస్, 7వ డివిజన్‌లో ప్రయాకర్‌రావు వినీల, బుర్ర జ్యోతి, వేముల సుక్కమ్మ, 8వ డివిజన్‌లో అడ్డగట్ల దేవదాస్, అవదూత నాగరాజు, కూస లక్ష్మీనారాయణ, గోరట్యాల ప్రకాష్, గంగుల రాజేందర్, రాపెల్లి శ్రీహరి, స్వర్గం రాజు, 9వ డివిజన్‌లో ఆడెపు జగదీశ్వర్, ఎనగందుల శంకర్, గాలిపెల్లి ప్రకాష్, చొప్పదండి శ్రీనివాస్, నేరెళ్ల ప్రేమ్‌కుమార్, సోమిశెట్టి దశరథం, 10 డివిజన్‌లో ఆడెపు అనసూర్య, ఏలూరి కవిత, చీటి గీత, మచ్చ రజిత, మామిడాల లత, వరుస హరిణి, 11వ డివిజన్‌లో ఉలిసె శ్రీనివాస్, కట్ల సతీస్, కొండి సదానందం, పత్తిపాక సురేష్, ఎర్రగుంట కపిల్, 12వ డివిజన్‌లో అడిగొప్పుల పరమేష్, ఆడెపు సూర్య, కూస మహేష్, కోడం సంజీవ్, గుడ్ల సురేష్‌కుమార్, బూర్ల విద్యాసాగర్, మామిడాల రమణ పోటీ పడుతున్నారు. వీరిలో కొందరు పోటీ ఇస్తున్న అభ్యర్థులతో ఒప్పందాల మేరకు ప్రచారం మాను కున్నట్లుగా తెలుస్తోంది.

చైర్మన్ ఎన్నికపై ఆసక్తి

సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎన్నికల ఫలితాలు, అభ్యర్థుల భవితవ్యం గురువారం తేలిపోనుండడంతో బ్యాంక్ చైర్మన్‌గా ఎవరికి అవకాశం రానున్నదనే దానిపై ఆసక్తి నెలకొంది. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ బ్యాంక్‌పై తమ ప్రాబల్యాన్ని చాటుకునే దిశగా ఆయా పార్టీల పెద్దలు పావులు కదుపుతున్నారు. ఏ పార్టీ మద్దతుదారులు గెలుస్తారనే చర్చ జోరుగా సాగుతోంది.



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎన్నికల అధికారి రామకృష్ణ

అర్బన్ బ్యాంక్ ప్రతిష్టతను పెంచుతాం

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

సిరిసిల్ల, సహకార అర్బన్ బ్యాంక్ ప్రతిష్టతను పెంచడంతోపాటు డిపాజిట్లు పెరిగేలా కృషి చేస్తానని, బీజేపీ మద్దతుతో పోటీలో ఉన్న అభ్యర్థులను గెలిపించాలని భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కోరారు. బుధవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్లకు తన సందేశాన్ని ఇచ్చారు. బ్యాంక్ సభ్యులకు గుర్తింపును తీసుకొస్తానన్నారు. బ్యాంక్ పారదర్శకంగా నడిచే విధంగా చూస్తానన్నారు.

రాజన్న ఆలయంలో మహాలింగార్చన



రాజన్న ఆలయంలో మహాలింగార్చనలో పాల్గొన్న భక్తులు

వేములవాడ టౌన్, జూన్ 5: వేములవాడ రాజరాజేశ్వరస్వామికి మాసశివరాత్రి సందర్భంగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆలయ కల్యాణ మండపంలో లింగాకరంలో దీపాలను వెలిగించి మహాలింగార్చన నిర్వహించారు. భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు షాకిచ్చిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు

- లెక్కలు వేసుకుంటున్న నేతలు - కేటీఆర్ ఇలాకాలో బీజేపీ వైపు మొగ్గు

- సిరిసిల్ల, వేములవాడలో పట్టు సాధించిన కాషాయ పార్టీ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలకు షాక్ ఇచ్చాయి. ఊహించని రీతిలో బీజేపీ వైపు ఓటర్లు మొగ్గు చూపడంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు లెక్కలు వేస్తున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ శాసనసభ నియోజకవర్గాల్లో సిరిసిల్ల నుంచి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కే తారకరామారావు, వేములవాడ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అసెంబ్లీలో వారికి వచ్చిన ఓట్లు కూడా ఆయా పార్టీ అభ్యర్థులకు ఇవ్వలేకపోవడంపై తీవ్ర నైరాశ్యంలో ఉండిపోయారు. 2023 శాసనసభ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ తన ఓటింగ్ శాతాన్ని పెంచుకుంది. రెండు సెగ్మెంట్లలో ప్రస్తుతం జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి 1,54,273 రాగా బీఆర్ఎస్‌కు 1,03,953 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ 69,632 ఓట్లతోనే సరిపెట్టుకుంది. 2023 శాసనసభ ఎన్నికల్లో సిరిసిల్ల సెగ్మెంట్ నుంచి బీఆర్ఎస్‌కు 89,244 ఓట్లు, కాంగ్రెస్‌కు 59,557, బీజేపీకి 18,328 ఓట్లు వచ్చాయి. వేములవాడ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ 71,451 ఓట్లు, బీఆర్ఎస్ 56,870, బీజేపీ 29,710 ఓట్లు వచ్చాయి. 2019లో సిరిసిల్ల సెగ్మెంట్‌లో బీఆర్ఎస్‌కు 70,482 ఓట్లు, బీజేపీకి 64,769, కాంగ్రెస్‌కు 18,733 ఓట్లు వచ్చాయి. వేములవాడ సెగ్మెంట్‌లో బీఆర్ఎస్‌కు 47,399 ఓట్లు, బీజేపీకి 72,290, కాంగ్రెస్‌కు 15,606 ఓట్లు వచ్చాయి. గత పార్లమెంట్ ఎన్నికల్లో సిరిసిల్ల సెగ్మెంట్ కేటీఆర్ ఇలాకాలో బీజేపీ కంటే బీఆర్ఎస్‌కు 5713 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఈ సారి ఎన్నికల్లో బీజేపీకి 6748 ఓట్లు పెరిగాయి. రెండు సెగ్మెంట్లలో ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 1,03,953 ఓట్లు, బీజేపీకి 1,54,273 ఓట్లు, కాంగ్రెస్‌కు 69,632 ఓట్లు వచ్చాయి. సిరిసిల్ల సెగ్మెంట్‌లో బీజేపీకి 72,559 ఓట్లు, బీఆర్ఎస్‌కు 65,811 ఓట్లు, కాంగ్రెస్‌కు 33,610 ఓట్లు, వేములవాడ సెగ్మెంట్‌లో బీజేపీకి 81,714 ఓట్లు, బీఆర్ఎస్‌కు 38,142 ఓట్లు, కాంగ్రెస్‌కు 36,028 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల్లో బీజేపీ ప్రాబల్యం పెంచుకోగలిగింది. సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు 2019 పార్లమెంట్ ఎన్నికల తరహాలోనే మెజార్టీ ఓట్లు వస్తాయని ఎంతో ధీమాతో ఉన్నా నిరాశపడ్డారు. బుధవారం సిరిసిల్ల సెగ్మెంట్‌లోని గ్రామాల వారీగా ఓటర్లను ఎక్కడా ఆకర్షించలేకపోయామని చర్చసాగుతోంది. ఓట్లను రాబట్టుకోవడంలో వైఫల్యంపై చర్చించుకోవడం కనిపించింది. మరోవైపు వేములవాడలో బీజేపీ ఓట్లు భారీగా పెరగడంపై కాంగ్రెస్‌లో అంతర్మథనం మొదలైంది. మూడు పార్టీల నాయకులు వచ్చిన ఓట్లపై కుస్తీ పడుతున్నారు.

మొక్కలు నాటాలి.. పర్యావరణాన్ని పరిరక్షించాలి

సిరిసిల్ల రూరల్, జూన్ 5 : ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణంలో భాగస్వాములు కావాలని, నాటిన మొక్కలను పరిరక్షించేందుకు ముందుకురావాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవనంలో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో ఫలసాయాన్నిచ్చే మునగ చెట్లను ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పెంచాలన్నారు. మునగ ఆకును పిల్లలకు ఇవ్వడం ద్వారా ఎనిమియాను అరికట్టవచ్చన్నారు. పోషణ వాటికలో భాగంగా ఆకుకూరలు, తోటకూరలు, గోంగూర, పాలకూర, బచ్చలికూర, కొత్తిమీరలాంటి మొక్కలను పెంచి లబ్ధిదారులకు ప్రత్యక్ష అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సఖీ కేంద్రం కో- ఆర్డినేటర్ విజయ, మహిళా సాధికారిక కేంద్రం కో- అర్డినేటర్ రోజా, జెండర్ స్పెషలిస్ట్ దేవిక, రమ్య, అర్చన, సంజీవ్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

కొనసా..గుతున్న బ్రిడ్జి పనులు

- వేములవాడలో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు
- ఒకటి పూర్తి.. మరొకటి అసంపూర్తి
- నిర్మాణ దశలో పలుమార్లు కూలిన కుడివైపు బ్రిడ్జి
- ప్రయాణానికి భక్తుల ఇబ్బందులు

వేములవాడ టౌన్, జూన్ 3 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రానికి నిత్యం వచ్చే వేలాది మంది భక్తులకు ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా నిర్మించేందుకు ప్రారంభించిన వంతెన పనులు దశాబ్దకాలం కావస్తున్నా పూర్తికావడం లేదు. వేములవాడ మూలవాగుపై అప్పటి ప్రభుత్వం 2015లో రూ.28 కోట్లతో రెండు బ్రిడ్జిల నిర్మాణం చేపట్టారు. 2018 వరకు రెండు వంతెనల నిర్మాణ పనులు పూర్తి చేయాలి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఎడమవైపుది పూర్తవగా కుడివైపు బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభదశలోనే నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే నిర్మాణ దశలోనే పలుమార్లు బ్రిడ్జి కూలిపోవడం చర్చనీయంశంగా మారింది. రెండు వంతెనలపై త్రిశులాలు, ఢమరుకాలతో బోస్టన్ పద్ధతిన స్వాగత తోరణలతో నిర్మించి ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా చేసిన ఊహాచిత్రాలు అప్పట్లోనే చక్కర్లుకొట్టాయి. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో చేపట్టిన పనులు అర్థంతరంగా నిలిచిపోవడం రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.



వేములవాడ మూలవాగుపై నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులు

నిర్మాణ దశలోనే కూలిన బ్రిడ్జి

మూలవాగుపై నిర్మిస్తున్న కుడివైపు బ్రిడ్జి నిర్మాణ దశలోనే పలు మార్లు కూలిపోయింది. ఏటా వర్షకాలం వస్తే చాలు బ్రిడ్జి కూలడం లేదా కుంగడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఎడమవైపు బ్రిడ్జి నిర్మాణం పూర్తవగా కుడివైపు భూసేకరణ పూర్తిస్థాయిలో కాకపోవడమే కారణమని తెలుస్తోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడంతో భారీ వర్షాలు పడుతున్న సమయంలో పనులు చేసినట్లు కాంట్రాక్టర్లు ఆర్భాటం ప్రదర్శిస్తున్నారు. పనుల్లో ఒక్క బ్రిడ్జి పనులు పూర్తయినా అప్పటి ప్రభుత్వం డబ్బులు చెల్లించడం లేదని 2018 సంవత్సరంలో కాంట్రాక్టర్ కట్టడానికి ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం చర్చనీయంశంగా మారింది. మూలవాగు వంతెన నిర్మాణంపై కాంట్రాక్టర్లు అలసత్వంగా వ్యవహరించడంతోనే పనుల్లో ఆలస్యం అవుతున్నట్లు అధికారులు సదరు కాంట్రాక్టర్‌ను పనులను నుంచి తొలగించారు. తమ తప్పేమి లేదని, భూసేకరణలో ఆలస్యం కావడంతోనే పనులు ఆలస్యం అవుతున్నాయంటూ కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించాడు. దీంతో అదే కాంట్రాక్టర్‌కు పనులు చేయాల్సిందిగా కోర్టు తీర్పు వచ్చిందని, పనులు ఇప్పటికీ ప్రారంభించలేదని ఆర్‌అండ్‌బీ ఏఈ సతీష్ పేర్కొంటున్నారు. 30 రోజుల క్రితం తాజాగా మరో నోటీస్ కాంట్రాక్టర్‌కు పంపించినట్లు తెలిపారు.

ఆర్భాటంగా భూమి పూజ

అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబు ఆధ్వర్యంలో అప్పటి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు,ఈటల రాజేందర్ బ్రిడ్జి పనులకు భూమిపూజ చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బ్రిడ్జి నిర్మాణాన్ని డిజైన్ చేశారు. డిల్లీ నుంచి సాంకేతిక పరమైన అనుమతులు పొంది పాత బ్రిడ్జికి ఇరువైపుల 12 మీటర్ల వెడల్పుతో 190 మీటర్ల పొడవుతో రెండు వంతెనలకు ఊహాచిత్రాలను సిద్ధం చేశారు.

సమన్వయ లోపం

గత ప్రభుత్వం హయాంలో ప్రారంభమైన పనులు పది సంవత్సరాలు కావస్తున్నా పూర్తి కాకపోవడంతో పట్టణ వాసులు, పలువురు రాజకీయ పార్టీల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లతో అధికారులకు సమన్వయం లేకపోవడంతోనే పనుల్లో జాప్యం జరుగుతోందని రాజకీయ నాయకులు విమర్శిస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పనులు ముందుకు సాగాలని అభిప్రాయపడుతున్నారు. త్వరతగతిన పనులు పూర్తి చేసి వచ్చే శివరాత్రికి సిద్ధం చేయాలని కోరుతున్నారు.

కొత్త ప్రభుత్వం పనులపై దృష్టిసారించాలి

- ప్రతాప రామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు.



గత ప్రభుత్వం ప్రారంభంలో మొదలైన పనులు ఇప్పటికీ పూర్తికాకోపోవడం ఆ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. పర్సెంటేజీల విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధుల్లో సమన్వయ లోపంతోనే పనుల్లో జాప్యం కొట్టచ్చినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం డబ్బులు చెల్లించడం లేదని కాంట్రాక్టర్ ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. కొత్త ప్రభుత్వం పనులపై దృష్టిసారించాలి.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

- బొజ్జ కనుకయ్య, జనసమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు.



వర్షకాలంలో బ్రిడ్జి కూలిన సమయంలో చీఫ్ ఇంజనీర్ విభాగం అనుభవదారులను తీసుకొచ్చి పరిశీలించాం. కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వక పోవడంతోనే పనుల్లో జాప్యమవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లాం. సీఎంకు వివరించి ప్రారంభం అయ్యేల కృషి చేస్తామని హామీచ్చారు.

కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు

- సతీష్, ఆర్‌అండ్‌బీ ఏఈ, వేములవాడ

బ్రిడ్జి పనులు 2015లో ప్రారంభమయ్యాయి. రూ. 28 కోట్ల నిధులతో నిర్మాణ పనులు చేపట్టాం. కాంట్రాక్టర్ ఎడమవైపు బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసినా కుడివైపు బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం చేశాడు. దీంతో కాంట్రాక్టర్‌ను తొలగించాం. కోర్టును ఆశ్రయించిన కాంట్రాక్టర్‌కు తిరిగి పనులు నిర్మాణం చేయాల్సిందిగా తీర్పు వచ్చింది. మళ్లీ పనులు చేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. 30 రోజుల క్రితం నోటీస్ అందజేశాం.

గ్రూప్-1 నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

వేములవాడ టౌన్, జూన్ 5 : గ్రూప్ - 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో చీఫ్ సూపరింటెండెట్లు, అబ్జర్వర్లు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆదేశించారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై సంబందిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, సీటింగ్ అరేంజ్ మెంట్, దివ్యాంగులకు కావాల్సిన స్క్రైబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. దివ్యంగులకు గ్రౌండ్ ఫ్లోర్‌లో అలాట్మెంట్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ వడ్లూరి శ్రీనివాస్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ మధు రాజేష్ పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌ను కలిసిన చల్మెడ లక్ష్మీనర్సింహారావు



వినోద్‌కుమార్‌తో మాట్లాడుతున్న చల్మెడ

వేములవాడ టౌన్, జూన్ 5: బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసిన బోయినపల్లి వినోద్‌కుమార్‌ను వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు బుధవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. పార్లమెంట్ ఎన్నికల తీరును విశ్లేషించారు. వేములవాడ నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ సరళిపై చర్చించారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

చందుర్తి, జూన్ 5 : చందుర్తి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని సాధించడంతో టపాసులు కాల్చారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, మండల అధ్యక్షుడు పొంచెట్టి రాకేష్, ప్రధాన కార్యదర్శి చిర్రం తిరుపతి, నాయకులు లక్కర్సు శశికుమార్, ఒరగంటి విజయ్, మర్రి మల్లేశం, లింగాల రాజయ్య, మార్త రాజు, సిరికొండ తిరుపతి, మహేందర్ పాల్గొన్నారు.

క్రీడలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట



దుస్తులు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ

చందుర్తి, జూన్ 5: క్రీడలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంతపురి బాలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆది శ్రీనన్న మండల వాలీబాల్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. నాయకులు మల్యాల నర్సయ్య, ఏరెడ్డి వెంకట్‌రెడ్డి, నేతికుంట తిరుపతి, సంకోజీ హరీష్, దారం బాల్ రెడ్డి, మనోహర్, ముద్దల రాము, అమరబండ సాయికుమార్, క్రీడాకారులు నితిన్, వంశీ, హేమంత్, అజయ్, ప్రశాంత్, సునీల్, అరవింద్, శ్యామ్, గోవర్ధన్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు

రుద్రంగి, జూన్ 5: రుద్రంగి మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి బయల్దేరారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేశవేణి ధర్మేందర్, గంగాధర్ పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో 'అల్ఫోర్స్' విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ టౌన్, జూన్ 5: నీట్-24 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత మార్కులతో జయకేతనం ఎగురవేశారని అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని అల్ఫోర్స్ కళాశాలలో నీట్‌లో అత్యు త్త మ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నీట్‌లో ఎస్. హేమంత్ 691 మార్కులు, వి.హాసిని 671, డి.పూజిత 650, ఎస్.కౌశిక్ రెడ్డి 647, పి.అక్షర రెడ్డి 639, వి.శ్రీముఖి 619, మరియాసభ 619, ఏ.శ్రీవర్ధిని 613, ఎం.కమాలికా ప్రీతి 613, ఎస్.జ్ఞానద 604, ఎ.అమరేందర్ 598, బి.హాసిత 595, కె.శ్రీవిద్య 582, ఎం.డి.అఫ్హాన్‌ఖాన్ 579, ఎస్.సాయిప్రతిజ్ఞ 573, ఎం.ప్రతిమ 571, పి.శ్రీనాథ్ 566, షేక్ ఉమ్రా 561, తేజస్విని 560, మహీన్ నజ్మీన్ 560 మార్కులు సాధించారన్నారు. కె.సుహృదాషవ పి.డబ్ల్యుడి కేటగిరిలో జాతీయస్థాయిలో 675వ ర్యాంకు సాధించారన్నారు. నీట్ కోచింగ్‌లో డాక్టర్స్- 30 ప్రత్యేక ప్రోగ్రామ్ ద్వారా కోచింగ్ అందించిన రెండో సంవత్సరంలో 10 మంది విద్యార్థులకు 600లకు పైగా మార్కులు రాగా, 20 మందికి 560 ఆపై మార్కులు, 41 మందికి 500 పై మార్కులు, 86 మందికి 450పై మార్కులు సాధించడం విశేషమన్నారు. పటిష్ట ప్రణాళికతో విద్యా బోధన, నిరంతర పర్యవేక్షణ, అకుంఠిత దీక్షతో నీట్‌లో అద్భుత ఫలితాలు సాధించారని విద్యార్థులను,తల్లిదండ్రులను, అధ్యాపకులను నరేందర్‌రెడ్డి అభినందించారు.



అల్ఫోర్స్ కాలేజీలో నీట్ టాపర్స్‌ను అభినందిస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

'శ్రీచైతన్య' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

కరీంనగర్ టౌన్, జూన్ 5: నీట్-2024 ఫలితాల్లో స్థానిక శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి లో అద్భుత మార్కులు సాధించినట్లు కళాశాల డీన్ జగన్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముజామిల్ ఖాన్ 633, సిహెచ్.చందన 533, అజ్మీరా రాజు 530, మిట్ట సిరివెన్నెల 524, కాలబోయిన అర్జున్ 517, రెశ్వంత్‌రెడ్డి 510 మార్కులు సాధించారన్నారు. అలాగే 400లకు పైగా మార్కులను 15 మంది వి ద్యార్థులు సాధించడమే కాకుండా పరీక్షకు హాజరైన వారిలో 60శాతం మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారని తెలిపారు. అనునిత్యం పర్యవేక్షణ, నీట్ పరీక్ష నిర్వహించే వరకు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపడం వల్లనే విద్యార్థులు జాతీయ స్థాయిలో అద్భుత ఫలితాలు సాధించారన్నారు. బుధవారం కళాశాలలో నీట్‌లో సత్తా చాటిన విద్యార్థులు వారికి సహకరించిన తల్లిదండ్రులను, శ్రీచైతన్య అధ్యాపక బృందాన్ని చైర్మన్ రమేశ్‌రెడ్డి అభినందించారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరు పతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, మోహన్ రావు, ఎంజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమేశ్‌రెడ్డి

100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ముత్తారం జూన్ 5: జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి పెద్దపల్లి జిల్లా కేంద్రానికి అక్రమంగా తరలిస్తున్న 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం తెల్లవారు జామున ముత్తారం మండలంలోని కాసర్ల గడ్డ వద్ద పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్నారని అందిన సమాచారం మేరకు సివిల్ సప్లై అధికారి మంథని రవీందర్ రాథోడ్ ముత్తారం గ్రామంలో ఒక వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాసింపల్లి గ్రామానికి చెందిన దుగ్యాల సమ్మయ్య కొంతకాలంగా తక్కువ రేటుకు రేషన్ బియ్యాన్ని గ్రామస్థుల దగ్గర కొని ఎక్కువ రేటుకు అమ్ముకొని లాభం పొందుతున్నాడు. అదే క్రమంలో బుధవారం అంబాల అనిల్‌కు చెందిన ఓ వ్యానులో రేషన్ బియ్యాన్ని పెద్దపల్లికి చెందిన ఆంజనేయులు, రాజు తరలిస్తుండగా సివిల్ సప్లై అధికారి ముత్తారం రోడ్డు వద్ద పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరిలించారు. ఈ మేరకు సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.


నిందితుల అరెస్టు చూపుతున్న సివిల్ సప్లై అధికారులు, పోలీసులు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వెండి, బంగారం ఆభరణాలు, రూ. లక్ష అపహరణ

కోరుట్ల, జూన్ 5: పట్టణంలోని అనంద్‌గిరినగర్ ప్రాంతం లోని తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగినట్లు కాలనీవాసులు, పోలీసులు బుధవారం తెలిపారు. కాలనీకి చెందిన పందిరి మురళి - కవిత దంపతులు మంగళవారం సాయత్రం ఇంటికి తాళంవేసి మేడిపల్లి మండలంలో రాజలింగపేట గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటి తులుపులు తీసి ఉన్న విషయం గమనించిన చట్టు పక్కల వారు చోరీ జరినట్లు గుర్తించి వారికి సమాచారం అందించారు. సమాచారం అందుకు న్న కవిత కుటుంబ సభ్యులు వెంటనే ఇంటికి చేరుకుని చూడగా ఇంటి తాళం పగులకొట్టి ఉండి ఇంట్లో సామగ్రి చిందర వంద రగా పడి ఉంది. బీరువాలో చూడగా అందులో ని ఐదుతులాల వెండి, తులం బంగారు అభరణాలతో పాటు లక్ష నగదు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. దీంతో కాలనీ వాసుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కిరణ్ కుమార్ తన సిబ్బంది తో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

'నీట్'లో ట్రినిటి విద్యార్థుల జయకేతనం


నీట్ ర్యాంకర్‌ను అభినందిస్తున్న ట్రినిటి అధినేత దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జూన్ 5: నీట్-2024 ఫలితాల్లో స్థానిక ట్రినిటి జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. బుధవారం నగరంలోని ట్రినిటి కళాశాలలో ట్రినిటి విద్యాసంస్థల ఫౌండర్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఛైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంకులను సాధించిన విద్యార్థులను అభినందించారు. ట్రినిటి విద్యార్థులు ముసాబ్ హుస్సేన్ 685 మార్కులు, బి.నిఖిల్ 681, సయ్యద్ ముజ కిర్ అలీ 676, ఎం.శశాంక్ 671, ఎ.ఆదిత్య 670, ఎ.కిరణ్ సింగ్ 667, పి.సందీప్ కుమార్ 665 మార్కులు, ఆర్.అజిత్ కుమార్ 657 మార్కులు, వివేక్ సిద్దార్థ్ 655 మార్కులు, ఎస్.మాళవిక 651 మార్కులు, ముజమ్మిల్ ఖాన్ 633 మార్కులు, వి.స్ఫూర్తి 599 మార్కులు, జె.కీర్తన 582 మార్కులు, వి.రాహుల్ 567 మార్కులు, సహరిష్ ఐమాన్ 558 మార్కులు, ఎస్.గంగశ్రీ 542 మార్కులు, ఆర్.ఆలేహ్యా 538 మార్కులు, ఎం. శ్రీజ 538 మార్కులు, పి.ప్రణయ్ 537 మార్కులు, సిహెచ్.విఘ్నేష్ 536 మార్కులు, ఈయేషా మహజబీన్ 535 మార్కులు, వై.అశ్లేష 532 మార్కులు, పి.శ్రీదీప 523 మార్కులు, హెచ్.కులకర్ణి 522 మార్కులు, సిహెచ్. సాయి మెహిత్‌రెడ్డి 507 మార్కులు, ఎస్‌కె గౌస్‌పాషా 505 మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో పటిష్టమైన ప్రణాళికతో, ఒత్తిడి లేని విద్యా విధానంతో ఈ ర్యాంకులు సాధించడం వీలైందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సి పాల్స్, అధ్యాపక బృందం ర్యాంకులు సాధించిన విద్యార్థు లు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


నిఖిల్ విష్ణు


సయ్యద్ అలీ


ఆదిత్య ఆనంద్


శశాంక్ మౌర్య

బస్సు ఢీకొని బాలుడి మృతి


మనీష్ (ఫైల్)

జగిత్యాలరూరల్, జూన్ 5: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన మామిడాల మనీష్ (5) అనే బాలుడిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మోరపల్లి గ్రామానికి మామిడాల మనీష్ అనే బాలుడు గ్రామంలో దుకాణానికి వెళ్లాడు. పండ్లు కొనుక్కొని తిరిగి తన ఇంటివైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో రాయికల్ వైపు నుంచి జగిత్యాల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు బాలుడిని ఢీకొట్టడంతో బస్సు వెనుక టైర్ కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి గంగన్న ఉపాధి నిమిత్తం సౌదీ వెళ్లగా తల్లి ఇంటి వద్దనే బాలుడితో కలిసి ఉంటుంది. మృతుడి తల్లి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాలుడి మృతికి కారణమైన వారిని శిక్షించి నష్టపరిహారం చెల్లించాలని సుమారు గంట పాటు రోడ్డుపైన మృతుడి బంధువులు ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, ఎస్సై సధాకర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో

ఇద్దరు యువకుల మృతి


సృజన్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం, జూన్ 5: ఇబ్రహీంపట్నం మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన బైరి సృజన్(29) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజేశ్వర్‌రావు పేట గ్రామానికి చెందిన బైరి సృజన్, జంగిటి శ్రీకాంత్‌లు ద్విచక్ర వాహనంపై రాజేశ్వర్‌రావుపేట నుంచి మెట్‌పల్లి వైపు వెళ్తున్నారు. మేడిపల్లి వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న కారు ఀ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమణించి హుటాహుటిన మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్రడి నుంచి మెరుగ్గైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ అసుపత్రికి తరలించారు. ఆసు పత్రిలో చికిత్స పొందుతూ బైరి సృజన్ మృతి చెందాడు. మరో యువకుడు శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పోలీస్‌లు పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపారు.

పొరండ్లలో మరో యువకుడు..

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల గ్రామ శివారులో కండ్లపల్లి సాయిరాజ్ (22) అనే యువకుడిని బుధవారం బొలెరో వాహనం వేగంగా ఎదురుగా వచ్చి బైక్‌ను బలంగా ఢీకొన్న సంఘటనలో రాయికల్ మండలం చింతలూర్ గ్రామానికి చెందిన సాయిరాజ్ అనే యువకుడికి తలకు బలమైన గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడని జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు సాయిరాజ్ తన ద్విచక్రవాహనంపై రాయికల్ మండలంలోని తన స్వగ్రామం చింతలూర్ నుంచి జగిత్యాలకు పని నిమిత్తం వెళ్తుండగా మార్గమధ్యలోని పొరండ్ల వద్ద ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. మృతుడు సాయిరాజ్ తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ అద్దెబస్సు

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), జూన్ 5: తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామ శివారులో ఆర్టీసీ అద్దెబస్సు బుధవారం అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. బస్సులో ఉన్న ప్రయాణికులు క్షేమంగా ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. సిద్దిపేట ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు బుధవారం తెల్ల వారుజామున 34 మంది ప్రయాణికులతో వేములవాడకు బయల్దేరింది. తంగళ్లపల్లి మండలం పద్మ నగర్ శివారులో డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడుపడంతో స్టీరింగ్ లాక్ పడింది. దీంతో బస్సు రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి వెళ్లి ఆగిపోయింది. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో సురక్షితంగా బయటపడ్డారు. సంఘటన స్థలాన్ని పోలీసులు, ఆర్టీసీ అధికారులు పరిశీలించారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి


రాజశేఖర్ (ఫైల్)

రాయికల్, జూన్ 5: రాయికల్ పట్టణానికి చెందిన బైరి రాజశేఖర్ (65) మంగళవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. పట్టణానికి చెందిన రాజశేఖర్‌కు ఇద్దరు కుమారులున్నారన్నారు. ఈ కుటుంబానికి గత కొంతకాలంగా ఆస్తి పంపకాల గొడవలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలోనే ఈ నెల 4న రాత్రి రాజశేఖర్‌కు, పెద్ద కొడుకు నరేష్‌కు మధ్య వాగ్వాదం జరిగిందన్నారు. ఈ సమయంలో ఇరువురు ఒకరినొకరు పెనుగులాడుకున్నారని, ఈ పెనుగులాటలో రాజశేఖర్ అదుపు తప్పి కిందపడగా, అక్కడే కుప్ప కూలిపోయాడని ఎస్సై వివరించారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని, అయితే రాజశేఖర్ గుండె నొప్పితో చనిపో యి ఉండవచ్చని లేదా ఇతర కారణాల వల్ల మృతి చెంది ఉండవచ్చని మృతుని భార్య కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. అయితే రాజశేఖర్‌కు మూడేళ్ల క్రితం గుండె ఆపరేషన్ జరిగిందని కుటుంబీకులు తెలిపారని ఎస్సై వివరించారు.

గల్ఫ్ నుంచి స్వగ్రామం చేరిన మృతదేహం

గంగాధర, జూన్ 5: మండలంలోని ఉప్పరమల్యాలకు చెందిన సందరగిరి రమేష్ (35) మే 10న దుబాయిలో మృతి చెందాడు. ఆయన మృతదేహం బుధవారం స్వ గ్రామానికి చేరింది. రమేష్‌ను ఓ ఏజెం టు 60 వేలు తీసుకుని విజిట్ వీసాపై దుబాయికి పంపించాడు. దుబాయిలో ఏడు నెలలు గడిచినా పని దొరకకపోవడంతో మానసింగా కృంగిపోయాడు. రెండు నెలల నుంచి పని లేక పోవడంతో మనస్తాపం చెందాడు. దీంతో ఆయ న ఆరోగ్యం దెబ్బతిన్న ది. తీవ్ర అనారోగ్యంతో మే 10న మృతి చెందాడు. ఆయన మృత దేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. రమేష్‌కు ఆరు లక్షల రూపాయల వరకు అప్పులున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కోడెమొక్కు చెల్లించుకున్న బీజేపీ నాయకులు



కోడెమెక్కు చెల్లించుకుంటున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ టౌన్, జూన్ 5:ప్రధాని నరేంద్రమోదీ, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ గెలుపొందడంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ బుధవారం రాజన్న ఆలయంలో కోడెమొక్కు చెల్లించుకున్నారు. ప్రధాన మంత్రిగా మూడోసారి నరేంద్రమోదీ ప్రమాణస్వీకరం చేయనున్నారని, ఎంపీగా రెండో సారి బండి సంజయ్ ప్రమాణస్వీకరణం చేయనున్నారని, ఈ సందర్భంగా కోడెమొక్కు చెల్లించుకున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..



కోడె మొక్కు చెల్లించుకుంటున్న నాయకులు

ఇల్లంతకుంట, జూన్ 5: మండల కాంగ్రెస్ నాయకులు వేములవాడలోని రాజన్న ఆలయంలో బుధవారం మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్‌పార్టీకి ప్రజల ఆదరణ లభించడంతోపాటు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వం పల్లి సత్యనారాయణ ముందస్తు జన్మదిన వేడుకల్లో భాగంగా కోడె మొక్కు చెల్లించినట్లు నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు అంతగిరి బాలపోచయ్య, సురేందర్‌రెడ్డి, ఎర్రోజు సంతోష్‌కుమార్, వీరేశం, జమాల్, కాసుపాక రమేష్, బెజ్జంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలి

ముస్తాబాద్, జూన్ 5 : ముస్తాబాద్ గ్రామ పంచాయతీలో ఈవో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని, చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారికి బుధవారం ముస్తాబాద్‌కు చెందిన సారుగు రాకేశ్ అనే న్యాయవాది ఫిర్యాదు చేశారు. ముస్తాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఇంటి మ్యుటేషన్‌కు సంబంధించి ఈవో రాజు రూ .30 వేలు డిమాండ్ చేశారని ఆరోపించారు. ఎందుకని ప్రశ్నిస్తే డబ్బులు ఇస్తేనే పని అవుతుందని, పైఅధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నాడని తెలిపారు. మొదటగా ఫోన్‌పే ద్వారా రూ.5 వేలు, చేతికి రూ.10 వేలు అందించినట్లు చెప్పారు. అయినా పనిచేయడం లేదని దీనికి సంబంధించిన ఆధారాలను జత పర్చామని పేర్కొన్నారు. అతడికి సహకరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీవోపై సైతం చర్యలు తీసుకోవాలన్నారు. ముస్తాబాద్‌లో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు వచ్చినా స్పందించకుండా డబ్బులు తీసుకుంటూ ప్రోత్సహిస్తున్నారన్నారు. అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటానని ఫిర్యాదుపై విచారణ జరిపిస్తానని డీపీవో హామీ ఇచ్చినట్లు రాకేశ్ తెలిపారు.

సహజ వనరులను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవయ్య

సిరిసిల్ల టౌన్, జూన్ 5: సహజ వనరులను ధ్వంసం చేస్తున్న వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని తెలంగాణ సహజ వనరుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు దేవయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం సిరిసిల్ల పట్టణం చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో తెలంగాణ సహజ వనరుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో దేవయ్య మాట్లాడారు. సహజ వనరులను కొంత మంది బడాబాబులు తమ ఆర్థిక ప్రయోజనాల కోసం కొల్లగొడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. వాగుల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తూ దళారులు స్థానిక ప్రజల అవసరాలకు మాత్రం అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. స్థానిక ప్రజల అవసరాలకు ఇసుక తక్కువ ధరకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సహజ వనరుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందనగిరి గోపాల్, కోశాధికారి వాసం మల్లేశంయాదవ్, నాయకులు బొంపల్లి సురేందర్‌రావు, మంగళి చంద్రమౌళి, కడారి రాములు, నరేష్‌నాయక్, గుండా థామస్, ప్రభాకర్, శ్రీనివాస్, చంద్రమౌళి, నందయ్య, వేణు, మల్లేశంగౌడ్, లక్ష్మణ్, శంకరాచారి, ప్రశాంత్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 5: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రెండో బైపాస్‌లో బుధవారం రాత్రి బైక్ అదుపుతప్పి మండల కేంద్రానికి చెందిన కుంచం పర్శరాములకు తీవ్ర గాయాలయ్యాయి. పర్శరాములు ద్విచక్ర వాహనంపై తన ఇంటి నుంచి బస్టాండ్ వైపునకు వెళ్తున్నాడు. మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న వ్యవసాయ పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో పర్శరాములకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎల్లారెడ్డిపేట, జూన్ 5: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని విశ్రాంత ఉపాధ్యాయుడు గంప నాగేంద్రంకు చెందిన ద్విచక్రవాహనం బుధవారం చోరీకి గురైంది. నాగేంద్రం తన బైక్ ను స్థానిక కొత్త బస్టాండ్‌లో పార్కు చేశాడు. ఊరికి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. దొంగ వాహనాన్ని ఎత్తుకెళ్లాడు. నాగేంద్రం కేకలు వేసినా లాభం లేకపోయింది. దొంగలు వాహనంతో క్షణాల్లో మాయమయ్యాడు. బాధితుడు నాగేంద్రం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలు

కొడిమ్యాల, జూన్ 5: మండల కేంద్రంలోని అంగడి బజారులో బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. తిప్పయ్యపల్లిలో మాజీ సర్పంచు మ్యాకల లత మల్లేశంయాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే సత్యం జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎల్‌వీప్రసాద్ కంటి ఆసుపత్రి వారు మం డల కేంద్రంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం, మండలంలోని నాచుపల్లి గ్రామంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆది శ్రీనివాస్ పరామర్శ

వేములవాడ టౌన్, జూన్ 5 : వేములవాడ పట్టణంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. పట్టణంలోని చింతలతాడెం మైసయ్య, చింతలతాడెం హన్మవ్వ, మామిండ్ల మల్లమ్మ, ఎదురుగట్ల మల్లేశం, కందుల శంకర్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆది శ్రీనివాస్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కౌన్సిలర్ ఇప్ప పూల అజయ్ నాయకులు కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, సాగరం వెంకటస్వామి, చిలుక రమేష్, పుల్కం రాజు, అంబాటి చందు ఉన్నారు.

● వేములవాడ విలీన గ్రామమైన తిప్పాపూర్ కౌన్సిలర్ కందుల క్రాంతి తండ్రి శంకరయ్య ఇటీవల మృతి చెందగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల రూరల్, జూన్ 5 : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, మొక్కలను నాటి వాటిని సంరక్షించినప్పుడే భావితరాలకు కాలుష్యరహిత సమాజాన్ని అందించగలమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడుజంక్షన్ నుంచి పట్టణంలోని బతుకమ్మ ఘాట్ వరకు అవగాహనకు బుధవారం సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. అనంతరం రగుడు జంక్షన్ నుంచి బుతుకమ్మ ఘాట్ వరకు జరిగిన ర్యాలీలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. చెట్లను పెంచడం ద్వారా భావితరాలకు కాలుష్యరాహిత సమాజాన్ని అందిగలమన్నారు. స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటుకు మొక్కలు నాటి కాపాడుకోవాలన్నారు. ఎక్కడైతే పచ్చదనం ఉంటుందో అక్కడ అహ్లాదకరమైన వాతావరణం ఉంటుందన్నారు. ప్రకృతి మనకు ఎంత ముఖ్యమైనదని, ప్రకృతి తరువాతనే జీవకోటి భూమిపైకి వచ్చిందన్న విషయాన్ని చరిత్ర చెప్పిన సత్యమని అన్నారు. భూ మండలంపై పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు చెట్లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. సైక్లింగ్, వ్యాయమంతో ఆరోగ్యవంతమైన శరీరాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు రఘుపతి, శ్రీనివాస్‌గౌడ్, వీరప్రతాప్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు యాదగిరి, రమేష్, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రహీంఖాన్



మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎస్పీ

పేట ఆదర్శ పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని సంరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరు తీసుకోవాలన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధూకర్, ఉపాధ్యాయులు బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ : పర్యావరణ పరిరక్షణ అందిరి బాధ్యతని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వడ్లకొండ అరవిందచంద్రం అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. తల్లిదండ్రులు, చిన్నారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. ప్రతి ఇంటా మొక్కలను పెంచాలని, ప్లాస్టిక్ వస్తువులను వినియోగించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కార్యాకర్తలు పద్మ, తులసి, అనురాధ, జయప్రభ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు దుమాల, అక్కపల్లి, గొల్లపల్లి, బొప్పాపూర్, నారాయణపూర్, వెంకటాపూర్, అల్మాస్‌పూర్ తదితర గ్రామాల్లో వివిధ శాఖల అధికారులు బుధవారం మొక్కలు నాటారు. అంతకుముందు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఉపాధిహామీ కూలీలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : పర్యావరణ పరిరక్షణ అందిరి బాధ్యతని గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు లింగన్నపేట సెక్టార్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం మొక్కలు నాటారు. తల్లిదండ్రులు, చిన్నారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పర్యావరణ ముప్పుతో కలిగే అనర్థాలను వివరించారు. ప్రతి ఇంటా మొక్కలను పెంచాలని, ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీ టీచర్లు సుకన్య, లక్ష్మీ, అనిత తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండల కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అమృత్ సరోవర్ చెరువుల వద్ద బుధవారం పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై ఉపాధి కూలీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్ పర్సన్ రాకేష్, ఏపీవో శ్రీహరి, టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు, క్షేత్ర సహాయకులు అజ్మీర రాజు, మేట్స్ లింబాద్రి, రాజు తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో పోలీసుల సైకిల్ ర్యాలీ



ఆదర్శ పాఠశాలలో మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధి కూలీలు

గ్రూప్-1 ప్రిలిమినరీకి పకడ్బందీ ఏర్పాట్లు

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల రూరల్, జూన్ 5: జిల్లాలో జరిగే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు, కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాలలో బుధవారం గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని, జిల్లాలో 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం 4699 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. కేంద్రాల పరిసర ప్రాంతాలలో ప్రత్యేకంగా పోలీసు నిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రూప్-1 పరీక్ష కేంద్రాలలోకి ఇతరులను అనుమతించ వద్దని, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని అన్నారు. చీఫ్ సూపరిండింట్ వద్ద తప్ప ఇతరుల మొబైల్ ఫోన్‌లకు అనుమతి లేదన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, అగ్రహారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

విరిగిపడిన విద్యుత్ స్తంభం



పొలంలో పడి ఉన్న విద్యుత్ స్తంభం

కోనరావుపేట, జూన్ 5 : కోనరావుపేట మండలం మరిమడ్లలో నెల రోజుల క్రితం ఈదురు గాలులకు విద్యుత్ స్తంభం విరిగి కింద పడింది. అప్పటి నుంచి మరమ్మతు చేపట్టకపోవడంతో ఆ ప్రాంత రైతులకు కరెంటు లేక ఇబ్బంది పడుతున్నారు. మరిమడ్ల గ్రామ శివారులోని బైరి మల్లేశం పొలంలో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభం విరిగి కిందపడిపోయింది. దాని స్థానంలో సెస్ అధికారులు మరమ్మతు చేపట్టకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సెస్ అధికారులు స్పందించి విరిగిన విద్యుత్ స్తంభాన్ని బాగు చేసి విద్యుత్ సరఫరా అందించాలని మరిమడ్ల రైతులు కోరుతున్నారు.

గ్రామాల్లో పట్టు సాధించాలి

ఎల్లారెడ్డిపేట, జూన్ 5: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావుకు మద్దతుగా కార్యకర్తలు, నాయకులు శ్రమించారని, ఓటమి పాలైన నిరాశ చెందకుండా గ్రామాల్లో పట్టు సాధించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కష్టపడిన తీరు అభినందనీయమన్నారు. బీజేపీ రామమందిరం, అక్షింతల పేరిట ఓటర్లను మభ్యపెడితే బీఆర్ఎస్ డబ్బులను పంచిందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిజాయితీగా ప్రజల్లోకి వెళ్లి అభ్యర్థిని గెలిపించాలని కోరారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చూడాలన్నారు. ప్రజలకు అండగా నిలబడి పట్టు సాధించాలని అన్నారు. కార్యకర్తలకు అండగా నిలబడిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు.

జగన్ అసమర్థ పాలనకు ప్రజల తీర్పు నిదర్శనం

సిరిసిల్ల టౌన్, జూన్ 5: జగన్ మోహన్ రెడ్డి అసమర్థత పాలనకు ప్రజల తీర్పు నిదర్శనమని తెలుగు దేశం పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి ఆవునూరి దయాకర్ రావు అన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో శాసన సభ, పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడంపై హర్ష వ్యక్తం చేస్తూ బుధవారం సిరిసిల్ల పట్టణం టీడీపీ కార్యాలయం వద్ద నాయకులు టపాసులు కాల్చి, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ చారిత్రాత్మకమైన విజయం సాధించిందన్నారు. ఐదు సంవత్సరాల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ అవినీతి, అక్రమాలకు అక్కడి ప్రజలు దిమ్మతిరిగే తీర్పునిచ్చారన్నారు. రాజధాని లేకుండా పాలన సాగించిన జగన్‌కు ప్రజలు సరైన సమయంలో గుణపాఠం చెప్పారన్నారు. రానున్న రోజులలో తెలంగాణలో టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు మచ్చ అంజనేయులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామెర సత్యం, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మ్యాన వెంకటేశం, టీఎన్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు మోతె రాజిరెడ్డి, నాయకులు కడారి రాంరెడ్డి, బింగి వెంకటేశం, గుజ్జె అశోక్, శ్యాగ ప్రశాంత్, దత్తాద్రి, లక్ష్మణ్, సత్తయ్య, నారాయణ పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి దయాకర్‌రావు

అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో ఆదరించండి



సిరిసిల్లలో మాట్లాడుతున్న శ్రీనివాస్

సిరిసిల్ల రూరల్, జూన్ 5: సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ పాలకవర్గం ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ప్యానల్ పోటీలో ఉందని, అభ్యర్థులకు ఓట్లు వేసి ఆదరించాలని బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అర్బన్ బ్యాంక్‌ను కాపాడేందుకు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హామీ ఇచ్చారన్నారు. నాయకులు గాజుల సదానందం, నరేష్, సుంకరి బాలకిషన్, కోడం శ్రీనివాస్, మోర శ్రీహరి, మామిడాల మహేష్, గుడ్ల సురేష్, ఇంజపురి మురళి, అంకారపు రాజు, తాటిపాముల సత్యం, రచ్చ రాహరాల్, దూడం సురేష్, సాగర్, శ్రీరాములు, మల్లేశం, రాజు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా మోదీ గాలి

వేములవాడ టౌన్, జూన్ 5 : దేశ వ్యాప్తంగా మోదీ గాలి వీచిందని, మూడో సారి ప్రధానిగా మోదీ ప్రమాణస్వీకరణ చేయనున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. వేములవాడ పట్టణంలోని భీమేశ్వరగార్డెన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా బీజేపీ నుంచి పోటీ చేసిన బండి సంజయ్‌కి ఉద్యమ సమయంలో కంటే ఎక్కువ మెజార్టీ వచ్చిందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రజలు మోదీ ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. వేములవాడ రాజన్నను దర్శించుకొని బహిరంగ సభకు వచ్చిన మోదీ కార్యక్రమంతో వేములవాడ, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాల్లో తీవ్ర ప్రభావం చూపిందన్నారు. మోదీ గ్యారంటీని ప్రజలు నమ్మారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా బీజేపీ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. గతంలో నాలుగు ఎంపీ సీట్లు ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 8 స్థానాలతో ముందంజలో ఉందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో కూడా బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కంటే 8 వేల ఓట్ల ఆధిక్యం బీజేపీ పార్టీకి వచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీని ప్రజల్లోకి మరింత తీసుకెళ్తామన్నారు. రాబోయే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోల కృష్ణస్వామి, ఎంపీపీ బండ మల్లేశం యాదవ్, వైస్ ఎంపీపీ జక్కుల కవిత తిరుపతి జిల్లా నాయకులు గోపు బాలరాజు, రేగుల మల్లికార్జున్, నాయకులు అక్కనపెల్లి వివేక్‌రెడ్డి, నామాల శేఖర్, మేర్గు లక్ష్మణ్, పిస్సింటి హన్మాండ్లు, జడల నర్సయ్య, సత్యం, రాజ్‌కుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిరిసిల్ల రూరల్, జూన్ 5: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రాలు అందించినా స్పందన లేకపోవడంతో శుక్రవారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టేందుకు నిర్ణయించామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ ప్రకటించారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృతలాల్ శుక్లా కార్మిక భవనంలో బుధవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశాన్ని యూనియన్ అధ్యక్షుడు మల్యాల నర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ కార్మికులకు జిల్లాలో నెలల తరబడి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలపై గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలన్నీ పరిష్కరిస్తుందని ఎదురు చూస్తున్నా సమస్యలు ఎక్కువ అవుతున్నాయన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించాలని, లేని పక్షంలో శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపడతామని స్పష్టం చేశారు. సీఐటీయూ నాయకులు అన్నల్ దాస్ గణేష్, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు లింగంపల్లి కృష్ణవేణి, వర్కోలు మల్లయ్య, నారపురం నర్సయ్య, సందెల మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

● ఏడుగురిపై దాడి

వెల్గటూర్, జూన్ 5: వెల్గటూర్ మండల కేంద్రంలో బుధవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. రోడ్డున పోయే వారిని కరిచి భయభ్రాంతులకు గురిచేసింది. ఒకే రోజు ఏడుగురిని కరవడంతో గ్రామస్థులు భయాం దోళనకు గురయ్యారు. వేసవి కావడంతో చిన్నారులు ఆరు బయట ఆడుకుంటుంటే ఎక్కడ పిచ్చి కుక్క కరుస్తుందో నని భయాందోళనకు గురయ్యారు. కుక్క కాటుకు గురైన వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు.

పిడుగుపాటుతో రైతు మృతి

భీమారం, జూలై 5: భీమారం మండలంలోని వెంకట్రావుపేటలో బుధవారం సాయంత్రం కొంగ గంగనర్సయ్య(46) అనే రైతు పొలంలో పనిచేస్తుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికు లు వెళ్లి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. గంగనర్స య్యకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

బీర్‌పూర్,జూన్ 5:బీర్‌పూర్ మండల కేంద్రంలోని పెద్దగుట్ట సమీపంలో గల నేరెళ్ల నరేష్ పత్తి చేనులో 11కేవీ విద్యుత్ వైరు తెగిపడింది. బుధవారం గుట్ట ప్రాంతానికి గొర్రెల మందను మేపడం కోసం వెళ్లిన సంపంగి నరేష్‌కు చెందిన గొర్రె తెగిపోయి ఉన్న విద్యుత్ వైరుకు తగిలి మృతి చెందింది. మృతి చెందిన గొర్రె విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందని, తనను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితుడు కోరారు. లైన్‌మన్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

దేవుడిని ముందు పెట్టి ఓట్లడిగారు

జగిత్యాల అర్బన్, జూన్ 5: బీజేపీ నాయకులు దేవుడిని ముందుపెట్టి ఓట్లు అడిగారని, తన స్థానికత అంశం జగిత్యాల జిల్లాలో చిన్నదైపోయి, వాటిముందు నిలవలేకపోయిందని భావిస్తున్నానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాలలో ఇందిరాభవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేవుడి ముందు పెట్టి ఓట్లు అడిగారని ఆయన ముందు నేనెంత, అందుకే తలవంచాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. బీజేపీ పార్టీ రాజకీయ లబ్ధికొరకు విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందన్నారు. ఆప్‌కీ బార్ చార్ సౌ అనే నినాదంతో ముందుకెళ్లిన బీజేపీకి, స్వల్ప వ్యవధిలోనే గత మెజార్టీని తగ్గించేలా ఇండియా కూటమి పావులు కదిపిందని, కాంగ్రెస్‌కు సైతం సీట్లు పెరిగాయని గుర్తు చేశారు. ఉత్తర ప్రదేశ్, వారణాసి లాంటి ప్రాంతాల్లో సైతం మోదీ విధానాలు, ఆర్భాటాలను ప్రజలు జీర్ణించుకోలేక పోయారన్నారు. తానే ఒక దైవదూతనంటూ మోదీ ప్రకటించు కోవడంతో ఉత్తర భారతదేశ ప్రజలు మోదీ వైఖరిని హర్షించ లేకపోయారన్నారు. ఢిల్లీకి చేరువలో ఉన్న పంజాబ్, హర్యాన రాష్ట్రాల్లో సైతం బీజేపీ ప్రభావం తగ్గిందన్నారు. తెలంగాణలో శత్రువుకు శత్రువు మిత్రుడు అన్నట్లుగా బీఆఆర్ఎస్ పార్టీ, బీజేపీకి అండగా నిలిచిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో త్రిముఖ పోరుగా ఉన్నట్లుగా కనిపించిన, చివరికి కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మారిందన్నారు. జగిత్యాల నియో జకవర్గంలోని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ స్వగ్రామమైన అంతర్గాంలో కాంగ్రెస్‌కు లీడ్ వచ్చిందన్నారు. అదే స్ఫూర్తితో ఎమ్మెల్యే నియోజకవర్గం మొత్తం బీఆర్ఎస్‌కు ఓట్లేయించే ప్రయత్నిస్తే బీజేపీకి ఓట్లు డైవర్ట్ కాకుండా పోయేదన్నారు. అర్వింద్ సొంతగడ్డపై కాంగ్రెస్‌కు 16వేల మెజార్టీ వచ్చిందన్నారు. రైతాంగం కోసం నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిచేలా కార్యరూపం దాల్చేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించామన్నారు. గల్ఫ్ కార్మికులు, బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం, గల్ఫ్ వెల్ఫేర్ బోర్డు, అర్హులందరికీ పెన్షన్ అందేలా చూడడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు చెప్పారు.